## క్లుప్తంగా

### మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (పొగతోట): జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డిని నగరంలోని వారి నివాసంలో నూతనంగా నియమితులైన జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

### శ్రీమద్రామాయణం, అయోధ్యకాండపై ఉపన్యాసం



నెల్లూరు(బృందావనం): ధర్మత్రయాన్ని వివరించే త్రివేణీ సంగమమే రామకథ అని ఆధ్యాత్మిక భాస్కర, ప్రముఖ ఉపన్యాసకుడు డాక్టర్ కోట కృష్ణమూర్తి పేర్కొన్నారు. సుందరసత్సంగంలో భాగంగా ఫతేఖాన్‌పేటలోని రామ మందిరంలో శ్రీమద్రామాయణం – అయోధ్యకాండపై శనివారం ఆయన ఉపన్యసించారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్తగా డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో పార్టీ 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిఖ్ ఆధ్వర్యంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోటమిట్టలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఖలీల్ అహ్మద్‌ను సత్కరించారు. రఫీ, హాజీ, హంజా హుస్సేనీ, అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

### ముస్లింల సత్తా చాటుతాం



నెల్లూరు రూరల్: రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీల సత్తా చాటుతామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రియాజ్ పేర్కొన్నారు. నగరంలోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో పలువురు ముస్లిం మైనార్టీ నేతలు విలేకరులతో శనివారం మాట్లాడారు. పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్తగా డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌ను ప్రకటించడంపై ఆనందం వ్యక్తం చేశారు. నగర, రూరల్ నియోజకవర్గాల్లో పార్టీ విజయానికి పాటుపడతామని చెప్పారు. 29వ డివిజన్ కార్పొరేటర్ సత్తార్, నేతలు కంతర్ అలీ, ఉమర్, ఇస్మాయిల్ ఖాదరీ, అబ్దుల్ రజాక్, సందానీ, ఖలీల్, జకీర్, అలీమ్, అలీభాయ్, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

### క్రాఫ్ట్ రంగాల ఉపాధి, రక్షణకు జేఏసీ ఏర్పాటు



లోగోను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): రాష్ట్రంలో 24 క్రాఫ్ట్ రంగాల వారికి ఉపాధి, రక్షణ కల్పించాలనే నినాదంతో జస్టిస్ ఆల్ ఆర్టిస్ట్ క్రాఫ్ట్ కమిటీ (జేఏసీ)ని స్థాపించామని నిర్వాహకులు పాటూరు శ్రీనివాసులు, కళాప్రపూర్ణ శామ్యూల్ మాస్టర్ పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని అనిల్ గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ సకల రంగాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జేఏసీ లోగోను ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కళలు, కళారంగంతో సంబంధంలేని వారి కారణంగా నిజమైన కళాకారుల పరిస్థితి దారుణంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కళాంజలి శ్రీనివాస చక్రవర్తి, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, పొంగూరు సుబ్బారెడ్డి, ముజీబ్, శ్రీను, రాజు మాస్టర్, యాంకర్ శాంతి పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే అనిల్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, మరోసారి ఇలా చేస్తే ఊరుకునేదిలేదని టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు హెచ్చరించారు. నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలో గల పార్టీ కార్యాలయంలో నేతలు వెంగళరెడ్డి, నాగసుబ్బారెడ్డి విలేకరులతో శనివారం మాట్లాడారు. ఎమ్మెల్యే అనిల్ నర్సరావుపేటకు పారిపోయారని ఆయన వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. మాజీ కార్పొరేటర్ దేవరకొండ అశోక్, నేతలు బ్రహ్మారెడ్డి, నాగరాజు, కత్తి చంద్ర, బాలు, విజయ్, బాలు, విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటును సద్వినియోగం చేసుకోండి

- కమిషనర్ వికాస్ మర్మత్
- నగరంలో అవగాహన ర్యాలీ



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలోని అర్హులు ఓటరుగా నమోదు చేసుకొని.. ఓటు హక్కును వినియోగించుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఓటుపై అవగాహన కల్పించే అంశమై రెండు భారీ ప్రచార వాహనాలను నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణం వద్ద శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. నగర నియోజకవర్గంలో ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు 60 ప్రచార వాహనాలతో పాటు ఓటరు అవగాహన క్యాంపులను నగరవ్యాప్తంగా నిర్వహించామన్నారు. ఎన్వీఎస్పీ ఓటర్ సర్వీస్ యాప్ ద్వారా ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించారని పేర్కొన్నారు. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు యాప్‌ను సందర్శించాలని కోరారు. సిటీ ప్లానర్ దేవీకుమారి, ఎన్నికల డీటీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు సిటీ: వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. వ్యాక్సిన్ ప్రివెంటబుల్ డిసీస్ సర్వైలెన్స్ కార్యశాలపై ఆత్మకూరు డివిజన్లోని ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులతో సమావేశాన్ని నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్చి మూడు నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని కోరారు. నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ఈ నెల తొమ్మిదిన పురస్కరించుకొని 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలను మింగించాలని కోరారు. డీఎల్ఏటీఓ ఖాదర్‌వలీ, డాక్టర్లు మౌనిక, సెలీనాకుమారి, రమేష్, భాస్కర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్రీడా కిట్ల అందజేత



నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలో విద్యారంగానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. 12వ డివిజన్లోని పెద్దచెరుకూరులో గల ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తన సొంత నిధులతో క్రీడా పరికరాలను మేయర్ శనివారం అందజేశారు. విద్యార్థులతో కొద్ది సమయం సరదాగా గడిపి వారితో కలిసి భోజనం చేశారు. నేతలు ప్రసన్నకుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బాబు, సరళ తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌కు మేయర్ స్రవంతి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీలకు పెద్దపీట వేస్తూ ఖలీల్ అహ్మద్‌ను సీఎం నియమించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

### కలెక్టర్‌ను కలిసిన కావలి ఎమ్మెల్యే



నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ హరినారాయణన్‌ను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్‌కు తెలియజేసి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

### దోషులను కఠినంగా శిక్షించాలి



కలెక్టరేట్ వద్ద ఏపీఆర్ఎస్ఏ నేతల నిరసన

నెల్లూరు(దర్గామిట్ట): విశాఖపట్నంలో తహసీల్దార్ రమణయ్యను దారుణంగా హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, ప్రధాన కార్యదర్శి డానియెల్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసనను శనివారం చేపట్టారు. కలెక్టరేట్ సిబ్బంది రామ్మోహన్, సతీష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### పశు వైద్యుల డైరీ ఆవిష్కరణ



నెల్లూరు (సెంట్రల్): జిల్లా పశు వైద్యుల నూతన సంవత్సర డైరీని జిల్లా పశు వైద్యశాఖ అధికారి మహేశ్వరుడు తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. డాక్టర్లు సోమయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ కార్యాలయంలో సంబరాలు



నెల్లూరు(మినీబైపాస్): బీజేపీ సీనియర్ నేత, రామజన్మభూమి ఉద్యమ పోరాటయోధుడు ఎల్కే అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్నను ప్రకటించిన నేపథ్యంలో నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సంబరాలను శనివారం జరుపుకొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### సచివాలయాల్లో తనిఖీ



మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నిబద్ధతతో ప్రజలకు సేవలందించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 50 / 1, 2 ఖాజీపేట, కామాక్షినగర్‌కట్ట, 46 / 1, 3 దండువారివీధి, బృందావనం వార్డు సచివాలయాలను శనివారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కులగణన సర్వేను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారి సమద్ తదితరులు పాల్గొన్నారు.

### నియామక ఉత్తర్వుల అందజేత



నెల్లూరు(పొగతోట): జెడ్పీ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలను కల్పించారు. ఈ మేరకు ఇద్దరికి ఆఫీస్ సబార్డినేట్లుగా ఉద్యోగాన్ని కల్పించి నియామక ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ చిరంజీవి అందజేశారు. జెడ్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు బీమ్‌రెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

### జేసీని కలిసిన వీఆర్ఏల సంఘ నేతలు



నెల్లూరు(దర్గామిట్ట): జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌ను గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యవర్గ సభ్యులు గున్నయ్య, తిరుమలరాజు, నాగేంద్రకుమార్, పెంచలయ్య పాల్గొన్నారు.

### భక్తులకు ప్రసాద వితరణ

నెల్లూరు(బృందావనం): నగరంలో శనివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్రకు హాజరైన వేలాది మంది భక్తులకు వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రసాదాన్ని అందజేశారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వీపీఆర్ ఫౌండేషన్ తరఫున కార్యక్రమాన్ని చేపట్టారు.

### వేతనాల పెంపుపై హర్షం

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్రంలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిబ్బందికి 11వ పీఆర్సీని వర్తింపజేస్తూ 23 శాతం వేతనాల పెంపుపై సమగ్రశిక్ష పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల అధ్యక్షురాలు విజితారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆమె మాట్లాడారు. వేతన పెంపుపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు.

### అనధికార మద్యం విక్రేత అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోదండరామపురంలో అనధికారికంగా మద్యాన్ని విక్రయిస్తున్న లక్ష్మయ్యను ఇన్‌స్పెక్టర్ వీరానాయక్ శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 11 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

### 'నారాయణ'లో శస్త్రచికిత్స విజయవంతం

నెల్లూరు సిటీ: ప్రమాదంలో వ్యక్తి కాలు.. చేతి వేళ్ల రక్తనాళాలు, నరాలు తెగిపోవడంతో అత్యవసర శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామని నారాయణ హాస్పిటల్ ప్లాస్టిక్ సర్జన్ విభాగాధికారి రాచూరు శ్రీలక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని నారాయణ హాస్పిటల్లో విలేకరుల సమావేశంలో శనివారం ఆమె మాట్లాడారు. నగరానికి చెందిన మహేష్‌రెడ్డి భవన నిర్మాణ పనులు చేస్తుండగా, అతని చేతి, కాలి వేళ్ల రక్తనాళాలు, నరాలు తెగిపోయాయని చెప్పారు. అత్యవసర శస్త్రచికిత్సను నిర్వహించి రక్తనాళాలు, నరాలను అతికించి విజయవంతం చేశామని తెలిపారు. హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత హోమియో వైద్య శిబిరం రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించనున్నామని డాక్టర్ యశోధర పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పురమందిరంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. బృందావనంలో యశోధర హోమియో క్లినిక్‌ను ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకు వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, వెంకురెడ్డి, శరత్, నరసింహ పాల్గొన్నారు.

### యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపారని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి పేర్కొన్నారు. శాంతినగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు చెందిన స్వప్న, అరుణ, కావ్యశ్రీ అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించడాన్ని అభినందించారు. యోగా గురువులు ప్రసన్న, రవీంద్ర పాల్గొన్నారు.

### ఘనంగా గంధ మహోత్సవం



నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లో గల ఖాజా గరీబ్ నవాజ్ దర్గా వద్ద గంధ మహోత్సవాన్ని వేడుకగా శనివారం నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదానాన్ని నిర్వహించారు. గంధాన్ని పలు ప్రాంతాల్లో ఊరేగించారు. జమీర్, చాన్‌బాషా, రసూల్‌బాషా, మహబూబ్, మస్తాన్, మాసూమ్‌వలీ, రహమత్‌బాషా, యస్దానీ, చోటూ, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

### సీపీఎస్‌ను రద్దు చేయరూ..



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

నెల్లూరు(టౌన్): ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్లను నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతి, కోశాధికారి మురళీధర్‌రావు, కార్యదర్శులు నాగిరెడ్డి, బాలరాగయ్య, ఖాజావలీ, రాష్ట్ర కౌన్సిలర్ శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

### • ఆద్యంతం.. కోలాహలం

క్రీడలపై యువతకు ఆసక్తిని కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం.. ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు శనివారంతో ముగిశాయి. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులను మంత్రి కాకాణి తదితరులు అందజేశారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఖోఖో మహిళా విభాగంలో ప్రథమ బహుమతి దక్కించుకున్న నెల్లూరు రూరల్ జట్టు



మహిళా విభాగ క్రికెట్ పోటీల్లో విజేతగా సర్వేపల్లి జట్టు



వాలీబాల్‌లో మొదటి స్థానం సాధించిన కోవూరు జట్టు



క్రికెట్ పురుషుల విభాగంలో విన్నర్స్‌గా కోవూరు జట్టు

# రహదారి భద్రతపై బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న చందర్

నెల్లూరు (టౌన్): రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శ్రీహరినగర్ సెంటర్ నుంచి భక్తవత్సల నగర్‌లోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయం వరకు 100 మంది ద్విచక్రవాహనదారులు హెల్మెట్లను ధరించి ర్యాలీని రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ర్యాలీని ఉప రవాణా కమిషనర్ చందర్ ప్రారంభించారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్లను విధిగా ధరించాలని కోరుతూ పోస్టర్లను రవాణా శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎమ్వీఐలు కొరప్రాటి మురళీమోహన్, బాల మురళీకృష్ణ, రాంబాబు, కార్తీక్, పవన్‌కుమార్, ఏఎమ్వీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు, నిందితులతో ఇన్‌స్పెక్టర్ తదితరులు

నెల్లూరు(క్రైమ్): చోరీలకు పాల్పడి.. కళ్లుగప్పి తిరుగుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. దర్గామిట్ట పోలీస్‌స్టేషన్లో శనివారం నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ఎస్సై రమేష్‌బాబు వెల్లడించారు. మూలాపేటకు చెందిన ఫక్రుద్దీన్, కొత్తూరు చౌటమిట్టకు చెందిన రఫీ వరుసకు అన్నదమ్ములు. చిన్నతనం నుంచే చెడు వ్యసనాలకు బానిసై నేరాల బాటపట్టారు. నిందితులపై ఇప్పటికే చిన్నబజార్, వేదాయపాళెం, బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్లలో హత్య, హత్యాయత్నాలు, దొంగతనం కేసులున్నాయి. పలుమార్లు అరెస్టయి జైలుకెళ్లొచ్చినా వీరి ప్రవర్తనలో మార్పురాలేదు. జీజీహెచ్ ఎదురుగా ఉన్న చార్టెడ్ అకౌంటెంట్ దిల్దార్ కార్యాలయ తాళాలను గతేడాది డిసెంబర్‌లో వీరు పగలగొట్టి అందులో ఉన్న రెండు ల్యాప్‌టాప్‌లను చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్గామిట్ట పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించారు. ఇన్‌స్పెక్టర్, ఎస్సై తమ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పద్మావతి సెంటర్ వద్ద నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రెండు ల్యాప్‌టాప్‌లతో పాటు వేర్వేరు ప్రాంతాల్లో దొంగలించిన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ రూ.55 వేలు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన సిబ్బందిని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అభినందించారు.

# ఖలీల్ అహ్మద్‌కు ఘన సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌ను కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. నగరంలోని 53, 54వ డివిజన్లలో పర్యటించిన ఖలీల్ అహ్మద్ అక్కడి నేతలు, కార్యకర్తలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొదటిసారిగా మైనార్టీ వ్యక్తిని నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో నిలపడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని చెప్పారు. టీడీపీ నేత నారాయణ నాలుగున్నరేళ్లు పత్తాలేకుండా ఎన్నికల సమయంలో ప్రజల ముందుకొచ్చారని విమర్శించారు. నగరానికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేసిన అభివృద్ధి.. సీఎం అందించిన సంక్షేమ పథకాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థిగా గెలుపొంది సీఎంకు మైనార్టీల తరఫున కానుకగా ఇస్తామన్నారు. పార్టీ నేతలు అశోక్, మస్తాన్, శోభన్‌బాబు, ప్రకాష్, షరీఫ్, ఖయ్యూం, జకీర్, వెంగళ్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫాగింగ్ మెషీన్ల అందజేత



నెల్లూరు(బారకాసు): దోమల నివారణ చర్యల్లో భాగంగా ఐదు హ్యాండ్ హెల్డ్ ఫాగింగ్ మెషీన్లను శానిటేషన్ విభాగానికి మేయర్ స్రవంతి అందజేశారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఫాగింగ్ మెషీన్ల పనితీరును శనివారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. నగరంలో 54 హ్యాండ్ స్ప్రేయర్ల ద్వారా మలాథియన్ మందును పిచికారీ చేస్తున్నారని చెప్పారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో రెండు భారీ ఫాగింగ్ మెషీన్లను ప్రస్తుతం ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఇరుకైన సందులు, చిన్నపాటి వీధులు, భవనాలు తదితర ప్రదేశాల్లో దోమల నివారణకు ఐదు హ్యాండ్ హెల్డ్ ఫాగింగ్ మెషీన్లను రూ.3.5 లక్షలతో కొనుగోలు చేశామని వివరించారు.